# శ్రీ అరబిందో
# భారతదేశ స్వరావతారం

మానవాధ్యయన సంస్థ
హైదరాబాద్.

భారతదేశ పునరుజ్జీవం అత్యంత ఆవశ్యకం, ఎందుకనగా భారతదేశ పునరుజ్జీవాన్ని ప్రపంచ భవిష్యత్తు తన హక్కుగా భావించి కోరింది. భారతదేశం శాశ్వతమైనది, భారతజాతి ఎప్పటికీ అంతరించదు, సమస్త మానవ జాతిలో భారత్ ఒక ఉన్నతమైన, దివ్యమైన భాగ్యాన్ని నిలుపుకుంది, ఇది ప్రపంచ మానవజాతి భవిష్యత్తునకు ఎంతో ఆవశ్యకం. భారత్ తన నుండి ఒక నూతన మరియు శాశ్వతమైన మతాన్ని భవిష్యత్తు ప్రపంచాని కంతటికి అందించాలి, ఈ శాశ్వతమైన మతం అన్ని మతాలను, విజ్ఞానాలను మరియు తాత్విక భావనలను సమన్వయపరిచి సమస్త మానవ జాతిని ఒకే ఆత్మ స్వరూపంగా తీర్చిదిద్దాలి.

- శ్రీ అరబిందో



# విషయ సూచిక


| | |
|---|---|
| 1) ఐదు కలలు | ... 7 |
| 2) ఉత్తరపర ప్రసంగం | ... 10 |
| 3) మూడు ఉన్మాదాలు | ... 23 |
| 4) జాతీయ కళాశాల విద్యార్థులకు ఇచ్చిన సందేశము | ... 26 |
| 5) శ్రీ అరబిందో బోధన మరియు సాధన విధానం వీరి మార్గం మరియు ఇతర మార్గాలు | ... 28 |

# ముందుమాట

శ్రీ అరబిందో : భారత దేశపు ఆత్మ స్వరావతారం

1907 ఆగస్టులో విశ్వ కవి రవీంద్రనాథ్ ఠాగూర్ శ్రీ అరబిందోను అమర వాక్యాలతో కీర్తించారు.

"ఓ అరబిందో, దివ్యమైన నా దేశ ఆత్మ యొక్క అగ్ని స్వరూపమా,
ఓ జాతీయ స్నేహితుడా, ఓ మిత్రమా,
ఓ స్వరావతారమా, నీకు నమస్కరిస్తున్నాను".

శతాబ్దం తర్వాత కూడా, శ్రీ అరబిందో ఆధ్యాత్మికంగా మరియు భౌతికంగా తమ దేశ గొప్పతనం కోసం కృషి చేయాలనుకునే వారందరికీ స్ఫూర్తి మరియు మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నారు. పూర్ణ స్వరాజ్, పూర్తి స్వేచ్ఛ కోసం భారతదేశ ప్రజలను మేల్కొల్పగల దృష్టి మరియు శక్తి అతనిది. అతను మానవజాతిని జ్ఞాన శక్తితో ఉద్ధరించడానికి తప్ప తన వ్యక్తిగత కీర్తి ప్రతిష్టల కోసం ఎన్నడూ తాపత్రయ పడలేదు.

ఆధ్యాత్మిక, ఐక్య భారతదేశంపై అతనికి గల దృష్టి మరియు ప్రపంచ సామరస్యం ఇంకా ఏకత్వంపై అతని ప్రవచనాత్మక పదాలు ప్రపంచం అంతా ప్రతిధ్వనిస్తున్నాయి. "ఎన్ని యుగాలైనా భారతదేశం అంతమవ్వలేదని, ఆమె స్వస్తి వచనాలు పలుకలేదని; ఆమె తన కోసం మరియు సమస్త మానవాళికి ఏదైనా చేయడానికి ఎంతవరకైనా జీవిస్తుంది" అని నమ్మేవారికి వాగ్దానం, మార్గనిర్దేశనం చేసే జ్ఞాన మరియు శక్తి యొక్క ఉన్నత స్వరూపమే శ్రీ అరబిందో.

గొప్ప మహర్షిగా పేరు పొందిన శ్రీ అరవిందులకు 15 ఆగస్టు 2021న ఆయన 150వ జయంత్యోత్సవం సందర్భంగా నివాళి అర్పిస్తూ, భారతదేశం మరియు ఆమె భవిష్యత్తు గురించి ఆయన లోతైన ఆలోచనల నుండి జాలువారిన కొన్ని వ్యాసాలను ఎంపిక చేసి జనబాహుళ్యంలోకి తీసుకు వచ్చాము. స్పష్టమైన భాష మరియు స్ఫూర్తిదాయకమైన ఆలోచనతో కూడిన శ్రీ అరబిందో యొక్క అంతరంగం మరియు అతని సమగ్ర యోగ గురించి ఒక సంగ్రహావలోకనం ఇక్కడ మనము పొందుతాము.

# దేశం అంటే ఏమిటి?

## లక్షలాది శక్తుల సమ్మిళితము

దేశం అంటే ఏమిటి? మన మాతృదేశం అనగా ఏమిటి?

మన మాతృదేశం కేవలం ఒక మట్టి ముద్ద కాదు, మాటల యొక్క రూపం కాదు, మన మనస్సు యొక్క కల్పనా కాదు, మన మాతృదేశం అనంత శక్తివంతమైనది, ఎలాగైతే ఆ జగన్మాత మహిషాసుర మర్ధిని అందరి దేవతల యొక్క ఐక్య శక్తి స్వరూపమో, మన మాతృదేశం కూడా లక్షలాది శక్తుల యొక్క సమాహారం మరియు సమ్మిళిత రూపం. ఆ శక్తినే మనం భారతదేశం అని పిలుస్తున్నాం, భవాని భారతిగా ఆరాధిస్తున్నాము. ఈ భారత శక్తి మూడు వందల లక్షల ప్రజల యొక్క సజీవ ఐక్య రూపం; కానీ నేడు ఈ మహత్తర శక్తి తామసిక గుణాల ఊచలతో బంధించబడి, నిస్తేజంగా మారింది. దీనికి కారణం తన పుత్రుల యొక్క అజ్ఞానము మరియు జఢత్వము. ఈ తామసిక దుర్గుణాన్ని రూపుమాపేందుకు మనలోని బ్రహ్మను మనం మేల్కొల్పాలి.

– శ్రీ అరబిందో

SABCL Voll p.65.

# ఐదు కలలు

## ఆగస్టు : 15

**(తిరుచిరాపల్లి ఆకాశవాణి వారి అభ్యర్థనపై... శ్రీ అరబిందో ఇచ్చిన సందేశం ఇది. 1947 ఆగస్టు 14 రాత్రి ప్రసారం చేయబడినది)**

ఆగస్టు 15న నా జన్మదినం అగుట వలన ఇది నాకు సహజంగానే సంతృప్తిని ఇస్తుంది, అదే రోజు ఇంత ప్రాముఖ్యత సంతరించుకోవడం కేవలం యాదృచ్ఛికం కాదు, నా జన్మకు కారణభూతమై, నా లక్ష్యాలకు భగవంతుడిచ్చిన మార్గ దర్శకత్వంగా ఆయన ఆమోద ముద్రగా, నా స్వప్నాలకు పరిపూర్ణతగా భావిస్తాను.

నిజమే, ఈ రోజున నా జీవితకాలంలో నెరవేరాలని నేను ఆశించిన దాదాపు అన్ని ప్రపంచ కదలికలను నేను చూడగలను, అయినప్పటికీ అవి ఆచరణ సాధ్యం కాని కలల వలె కనిపించినా, అవి ఫలించే లేదా సాధించే మార్గంలో ఉన్నాయి. అవి నిజంగా జరగడానికి నాంది మన మాతృదేశ స్వాతంత్ర్యం. ఈ మార్పులలో భారతదేశం నాయకత్వం వహించవచ్చు.

నా మొదటి స్వప్నం: స్వాతంత్ర్యం మరియు సమైక్య భారతదేశాన్ని సృష్టించే విప్లవాత్మక ఉద్యమం!

అయితే, భారత దేశం ప్రస్తుతం స్వతంత్రమైనది కానీ ఏకమవలేదు. ఒకప్పుడు, ఈ స్వాతంత్ర్యమే, మళ్లీ వెనుకటి రోజులలాగా, విడివిడి రాష్ట్రాలుగా విభజింపబడి, పూర్వపు రోజుల లాగ ఆంగ్ల రాజ్యానికి బానిస అయ్యే అవకాశానికి దారి తీయవచ్చునన్న అపాయం ఉన్నది, కానీ, అదృష్ట వశాత్తు, అలా జరగక పోవచ్చును. అదీకాక, రాజ్యాంగ సమ్మేళన (Constituent Assembly) కారణంగా, నిమ్న జాతి సమస్యలు, విభజన లేకుండా పరిష్కరింపబడే అవకాశం ఉన్నది. కానీ, హిందూ ముస్లింల మధ్యనున్న

వైషమ్యాలు ఇంకొంత బలపడి, దేశ విభజన శాశ్వతంగా జరుగుతున్నట్లున్నది. ఈ విభజన తాత్కాలికమని, శాశ్వతం కాకూడదని ఆశ. అదే జరిగిన నాడు, దేశం ఇంకా బలహీనమయి, మళ్లీ పరదేశాల ఆక్రమణకు దోహదమవ్వచ్చు. అలా జరిగిన నాడు, భారత దేశం అంతర్గతంగా బలహీనమయి, భవిష్యత్తు దుర్గమమవ్వచ్చు. అలా జరుగకూడదు, ఇప్పటి విభజన అంతరించాలి అది ఏ విధంగా జరిగినా సరే, విభజన అంతరించి, ఏకైక రాజ్యంగా ఉన్న నాడే భారతదేశ భవిష్యత్తు సక్రమంగా, సురక్షితంగా ఉంటుంది.

వేరొక స్వప్నం : మొత్తం ఆసియా ఖండపు వాసుల సంపూర్ణ స్వతంత్రం, తద్వారా, సర్వమానవ స్వాతంత్ర్యం కోసం పాటుబడే భారతదేశం, తన పూర్వపు పాత్ర వహించాలి. ఆసియా జాగృతమైనది. చాలా భాగాలు స్వతంత్రమైనాయి. ఇంకా కొన్ని ఆ ప్రయత్నంలో ఉన్నాయి. ఈ సంఘర్షణలో భారతదేశానికి చాలా బాధ్యత ఉన్నది, తన శక్తి, సామర్థ్యాలతో ఇంకా చేయవలసినది కొంత ఉన్నది, అది జరుగుతుంది కూడా. భారతదేశం ద్విగుణీకృతమైన శక్తితో నాయకత్వం వహించగలదు.

ఇంక మూడవ స్వప్నం : ప్రపంచ వ్యాప్తంగా, ఏకమయిన సిద్ధాంతాలతో, మానవ జీవితాలను ఉన్నత స్థితికి తీసుకుని రావడం. ఈ సమైక్యత ఆరంభమయినది కానీ కొంత అసంపూర్ణంగా ఉన్నది, విపరీతమైన ఆటంకాలని ఎదుర్కొంటున్నది అయితే, సంచలనం మొదలయినది, కానీ భారతదేశం నాయకత్వం వహించే పద్ధతిలో, ప్రస్తుత పరిస్తితులు క్లిష్టంగా ఉన్నా, భవిష్యత్తులో అవి చక్కబడి, మరల మనదేశం సకల విశ్వాన్ని సమైక్యం చేయగలదు. అనుకోని ఆటంకం ఎదురయి, జరుగుతున్న పురోగతిని ఆపవచ్చు కానీ, ఆఖరు విజయం తప్పదని నా నమ్మకం. సమైక్యత అన్నది ప్రకృతి సహజమైన స్వభావం. ఈ సమైక్యత లేకున్న, చిన్న చిన్న దేశాలు దెబ్బతిని మరలా పరతంత్రమవ వచ్చు. కావున, ఐక్యత అవసరం. మనిషిలోని స్వార్థం, అసహనం దీనికి అడ్డు పడవచ్చు కానీ దైవికమైన శక్తి ముందు అవి ఎంతో కాలం నిలువవు. విశ్వ వ్యాప్తంగా ఐక్యత రావాలి, దేశాల మధ్య సాంస్కృతిక సమన్వయము కావాలి, అంతర్జాతీయంగా ఐక్యత రావాలి.

వేరొక స్వప్నం : భారతదేశపు ఆధ్యాత్మికత, ప్రపంచ వ్యాప్తంగా మొదలయినది. ఐరోపా అమెరికా ఖండాల్లో దీని వ్యాప్తి కనపడుతున్నది. ఈ ఉద్యమం ఎదుగుతుంది క్లిష్ట పరిస్థితులలో, మిగిలిన దేశాలు, తమ మానసిక, ఆధ్యాత్మిక పరిణతి కోసం భారతదేశం వైపు మొగ్గుతున్నాయి.

చివరి స్వప్నం : చివరగా, మనిషి ఇంకొంత ఉన్నత స్థాయికి ఎదగాలి. మానవతకు పరిపక్వత కలిగి మానసికంగా ఉన్నత స్థాయికి చేరుకోగలగాలి, తద్వారా, ఒక ఉన్నతమైన సమాజం ఏర్పడాలి.

ఇది ఇంకా, నా వ్యక్తిగత స్వప్నం, ఆశయం, ఆకాంక్ష.

ఈ భావం, పశ్చిమ దేశాలలో కూడా పాదుకున్నది అయినా, ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా భగవత్సంకల్పంతో, వాటిని దాటవచ్చు. ఈ ఉద్యమంలో, భారతదేశం ప్రాముఖ్యత వహించి, దైవిక, ఆధ్యాత్మిక శక్తులసహాయంతో లక్ష్యాన్ని సాధించవచ్చు.

ఈ భారతదేశ విముక్తి (స్వాతంత్ర్యం) సందర్భాన, ఇది నా సందేశం, ఈ ఆశ ఎంతవరకు ఎలా సమర్థించబడుతుంది అనేది కొత్త మరియు స్వేచ్ఛా భారతదేశం మీద ఆధారపడి ఉంటుంది.

*Source : SABCI vol 26, "On Himself" page 404-406*

# ఉత్తరపర ప్రసంగం

**(ఆలీపూర్ కుట్రకేసు నుండి నిర్దోషిగా బయటపడిన కొద్దిరోజులకే, బెంగాలులోని ఉత్తరపరాలో ధర్మరక్షిణి సభ, 1909 మే నెల 30న నిర్వహించిన సమావేశంలో శ్రీ అరవిందుల ప్రసంగపాఠమిది.)**

ఈ రోజున మీ సభ వార్షిక సమావేశంలో హిందూమతాన్ని గురించి మాట్లాడవలసిందిగా నన్ను కోరారు. నేనిచట కూర్చుని ఉన్నప్పుడు మీకు చెప్పవలసిన మాట, నా మదిలో ప్రవేశించింది. అది మీకే కాదు, మొత్తం భారతజాతి నుద్దేశించి పలుకవలసిన మాట. ఆ మాట నాకు జైలులో, నా అంతరంగంలో విన్పించింది. దానిని నా ప్రజలకు విన్పించడానికే నేను జైలు నుండి విడుదలైనాను.

నేను చివరిగా ఇచటికొచ్చి సంవత్సరం దాటింది. నేనపుడు ఒంటరిగా లేను. ఒక గొప్ప శక్తివంతుడైన జాతీయతా ప్రవక్త నా చెంత ఉన్నాడు. తాను చెప్పవలసి వున్న మాటను నిశ్శబ్దంలో, ఏకాంతంగా వినడానికి భగవంతుడు విధించిన ఏకాంతవాసం నుండి అప్పుడే బయటికొచ్చిన వ్యక్తి అతడు. మీరంతా వందల కొలదీ వచ్చి స్వాగతం పలికిన వ్యక్తి అతడు. కాని ఇపుడాతడు చాలా దూరంగా, మన నుండి వేరుచేయబడి వేలమైళ్ల దూరంలో ఉన్నాడు. నేను చూడ్డానికలవాటుపడిన నా సహకార్యకర్తలిపుడిచట లేరు. దేశంపై విరుచుకుపడిన పెనుతుఫాను తాకిడికి వాళ్లంతా చెల్లాచెదురై దూరమైపోయారు. ఇపుడు నేను సంవ త్సరం పాటు ఏకాంతజీవితం గడిపి బయటికొచ్చి చూసేసరికి అంతా మారిపోయి కన్పిస్తోంది. ఎప్పుడూ నా ప్రక్కనే ఉంటూ, నా

కార్యంలో సహకరించిన వ్యక్తి ఇపుడు బర్మాలో ఖైదీగా ఉన్నాడు. మరొకరు ఉత్తర భారతంలో నిర్బంధించబడి కుమిలిపోతున్నాడు. నేను బయటికొచ్చి నన్ను అది వరకు ఊరడించి, ప్రేరణనిచ్చినవారి కోసం, చుట్టూ చూసాను. నాకు వాళ్లు కన్పించలేదు. నేను జైలుకు వెళ్లే సమయంలో వందేమాతరం నినాదాల ప్రతిధ్వనులతో దేశం మొత్తం ఒకే జాతి అనే విశ్వాసం సజీవంగా ఉంది. దైన్యస్థితి నుండి నూతనోత్తేజంతో, ఉద్దీపితమైన కోట్లాది మానవుల ప్రగాఢ ఆకాంక్షతో సజీవంగా ఉంది. నేను జైలు నుండి బయటికొచ్చిన తర్వాత ఆ ఆక్రందన విన్పిస్తుందేమోనని చూసాను. కాని దానికి బదులు నిశ్చలనీరవత యెదురైంది. దేశాన్ని నిశ్శబ్దం ఆవరించింది. మనుష్యులు దిగ్భ్రమ చెందారు. కారణం అంతకు పూర్వం మన ముందున్న తేజో మయమైన భగవంతుని స్వర్గంలాంటి భవిష్యత్తును గురించిన ఆశావహ దృక్పథానికి బదులు, మన శిరసుల పై మానవ ఉరుములు, మెరుపులు, వర్షిస్తున్న భారమైన ఆకాశం పరచుకొని కన్పించింది. ఎటువైపు నడక సాగించాలో ఎవరికీ తెలిసినట్లు లేదు. “తరువాత ఏం చేయాలి? మనమేం చేయగలమింకా?” అనే ప్రశ్న అన్ని వైపుల నుంచీ ఎదురైంది. ఎటు నడవాలో, ఏం చేయాలో నాకూ తెలియలేదు. కాని ఒక్క విషయం మాత్రం నాకు తెలుసు. ఆ ఆక్రందనను, ఆ విశ్వాసాన్ని రేకెత్తించింది భగవంతుని అజేయశక్తి. ఈ నిశ్చల నీరవతను ఆవరింపజేసింది కూడా ఆ మహాశక్తే అని నాకు తెలుసు. ఎవరైతే ఎలుగెత్తి పలికినవాటిల్లోనూ, ప్రబల ఉద్యమాల్లోనూ వున్నారో అతడే ఈ నిశ్శబ్దంలోనూ, స్తబ్ధతలోనూ ఉన్నాడు. ఈ జాతి క్షణకాలంపాటు తనలోనికి తాను ఉపసంహరించుకొని భగవంతుని సంకల్పాన్ని తెలుసుకునేందుకు, ఈ విరామస్థితిని కూడా ఆయనే పంపించారు. దీనిని చూసి నేను నిస్పృహ చెందలేదు. ఎందుచేతనంటే జైలులో నాకు ఈ నిశ్చల నీరవతా స్థితి బాగా అలవాటైపోయింది. అంతేకాదు, విరామంగా నిశ్శబ్దంలో సంవత్సర కాలంపాటు సుదీర్ఘంగా సాగిన నిర్బంధంలో ఈ గుణపాఠం నేర్చుకున్నాను. బిపిన్ చంద్ర పాల్ జైలునుంచి విడుదలైనపుడు అతడొక సందేశంతో వచ్చాడు. ఉత్తేజ కరమైన సందేశం స్వీకరించి వచ్చాడు. అతడిచట వెలువరించిన ప్రసంగాన్ని విన్నాను. ఆ ప్రసంగంలో గర్భితమైన భావం, ఆ ప్రసంగం యొక్క ఉద్దేశ్యం మతపరమైనంతగా రాజకీయమైనది

గాదు. మనందరిలో నున్న భగవంతుని గురించి, జాతి యందుగల ఈశ్వరుని వాస్తవ దర్శనాన్ని గురించి అతడు మాట్లాడాడు. ఆతని తరువాతి ప్రసంగాల్లో కూడా, ఈ ఉద్యమంలోని సాధారణశక్తిని గురించిగాక, అందులోగల గొప్ప అసాధారణ శక్తిని గురించి, ఆ ఉద్యమం ముందున్న సాధారణ కార్యాన్ని మించి వున్న గొప్ప అసాధారణ కార్యాన్ని గురించి మాట్లాడాడు. ఇపుడు నేనూ మిమ్మల్ని తిరిగి కలుసుకుంటున్నాను. నేనూ జైలు నుంచి బయటి కొచ్చాను. ఉత్తర పరావాసులైన మీరే మళ్లీ నన్ను ప్రప్రథమంగా రాజకీయసభకు కాకుండా, మన మతాన్ని రక్షించడానికేర్పడిన సంఘం యొక్క సమావేశంలో మాట్లాడడానికి ఆహ్వానించారు. బక్సర్ జైల్లో బిపిన్ చంద్రపాల్ స్వీకరించిన సందేశాన్ని భగవంతుడు నాకు ఆలీపూర్ జైల్లో ప్రసాదించాడు. నా పన్నెండు నెలల కారాగారవాసంలో ప్రతి రోజూ భగవంతుడు అందించిన జ్ఞానాన్ని మీకు అందించాలని భగవంతుడు నన్ను ఆదేశించినందువల్ల ఇప్పుడు నేను బయటికొచ్చాను.

నాకు తెలుసు నేను విడుదలౌతానని. సంవత్సర కాల నిర్బంధం, కేవలం ఒక సంవత్సరకాల ఏకాంతవాసం, నాకు శిక్షణ నిచ్చే నిమిత్తం ఉద్దేశించబడింది. భగవంతుని కార్యానికవసరమైన ఒక్క సంవత్సరంకంటె ఎక్కువకాలం నన్నెవరైనా జైల్లో ఉంచగలరా? నేను పలుకవలసిన ఒక మాటను, నేను చేయవలసిన ఒక కార్యాన్ని ఆతడు నాకిచ్చాడు. ఆ మాట పలికేంతవరకూ, ఏ మానుషశక్తి నా నోరు మూయలేదు. ఆ కార్యం నిర్వహించబడేంతవరకూ ఏ మానుష శక్తి, ఆ భగవంతుని ఉపకరణాన్ని, అదెంత బలహీనమైనదైనప్పటికీ లేదా ఏ విధంగా అల్పమైనదైనా, అడ్డుకోలేదు. నేనిపుడు బయటికొచ్చి ఇక్కడున్న కొద్ది నిముషాల్లోనే, నేను మాట్లాడాలని భావించని మాటను నేను పలకాలని సూచించబడింది.

నా మనస్సులో ఉన్న విషయాన్నతను బయటకు త్రోసివేసాడు. ఇపుడు నేను పలికేది, నిరోధించలేని ఒక ఆకస్మిక ప్రేరణకు లోనై, పలుకుతున్నాను.

నన్ను అరెస్టు చేసి లాల్‌బజారు హాజత్ కు తరలించినపుడు నేను అతని

ఉద్దేశ్యపు అంతర్యాన్ని గ్రహించలేక పోయాను. అందుచేత ఒకింత తబ్బిబ్బయ్యాను. అందుచేత ఓ ఘడియ సేపు పొరపడి నా హృదయం అతనికై ఆక్రందించింది. "ఏమిటిది? నా కేమిటిలా జరిగింది? నా దేశప్రజల కోసం నేను నిర్వహించవలసిన మహత్కార్యం నాకొకటి ఉన్నదని నమ్మాను. ఆ కార్యం పూర్తయ్యేదాకా నాకు నీ రక్షణ ఉంటుందని భావించాను. అయినపుడు ఎందుకు ఇటువంటి నేరం మోపబడి నేనిక్కడు న్నాను?" ఒక రోజు గడిచిపోయింది, రెండో రోజు, మూడో రోజూ కూడా గడిచిపోయాక నాలోనే అంతర్వాణి విన్పించింది. "వేచి చూడు". అపుడు నేను శాంతించి వేచి చూసాను. తర్వాత నన్ను లాల్ బజారు నుంచి, ఆలీపూర్ జైలుకు మార్చి మనుష్యుల నుండి వేరుచేసి, ఏకాంతంగా ఉండే చిన్నగదిలో ఒక నెలపాటు ఉంచారు. అచట రేబవళ్లు, నాలోని దివ్యవాణి విన్పిస్తుందేమోనని, నా కేం చెప్పాలని ఆయన సంకల్పించాడో తెలుసుకుందామని, నేనేం చేయాలో ఆయన నుండి నేర్చుకుందామని వేచి చూశాను. ఈ ఏకాంతంలో మున్ముందుగా ఒక సాక్షాత్కారం, మొట్టమొదటి పాఠం నాకు లభించింది. అప్పుడు నాకు జ్ఞాపకం వచ్చింది. నన్ను నిర్బంధించడానికి ఒక నెల రోజుల ముందు, సమస్త కార్యకలాపాలన్నీ ప్రక్కన పెట్టి ఆయనతో మరింత సన్నిహితంగా వ్యవహరించగలిగే టట్లు ఏకాంతానికి వెళ్లి నాలోనికి నేను దృష్టి మళ్లించాలని ఒక పిలుపు వచ్చింది. అపుడు నేను బలహీనుణ్ణి. ఆ పిలుపు కనుగుణంగా వ్యవహరించ లేకపోయాను. నా పని నాకు అత్యంత ప్రియంగా కన్పించింది. నేను లేకపోతే, పనికిబ్బంది కలుగుతుంది, అది విఫలమై ఆగిపోవచ్చు కాబట్టి నేను చేస్తున్న పనిని విడిచి పెట్టగూడదని, ఒకింత గర్వంతో భావించాను.

అతడు మళ్లీ మాట్లాడినట్లు, నాకిలా చెప్పాడని అన్పించింది. "నీ అంతట నీవు ఛేదించడానికి శక్తి చాలని శృంఖలాలను నీ కోసమై నేను త్రెంచి వేశాను. ఎందుకంటే నీవిదే కార్యంలో కొనసాగాలనేది నా సంకల్పం కాదు. నా ఉద్దేశ్యం ఎప్పుడూ కాదు. నీవు చేయవలసి వున్నది నీ కోసం వేరే ఉన్నది. దాని కోసం నిన్నిచటకి తీసుకొచ్చాను. నీ అంతట నీవు నేర్చుకోలేనిదాన్ని బోధించడానికి, నా కార్యం నిర్వర్తించడానికి నీకు శిక్షణ నిచ్చేందుకు నిన్నిచటకు తీసుకొచ్చాను."

అపుడు ఆయన గీతను నా చేతుల్లో పెట్టాడు. ఆతని బలం నాలో ప్రవేశించింది. గీతా సాధన చేయగలిగాను. మేధోపరంగా అర్థం చేసుకోవడమే కాదు, అర్జునుని నుండి శ్రీకృష్ణుడు ఏది కావాలని పట్టుబట్టాడో, ఆతని కార్యం చేయాలని ఆకాంక్షించేవారందరి నుండి ఏం కావాలని పట్టుబట్టాడో, రాగద్వేషాల నుండి స్వేచ్ఛ, ఫలితాన్నాశించకుండా ఆయన కార్యం చేయడం, స్వీయ సంకల్పాన్ననుసరించిగాక ఆతని హస్తాల్లో ఒదిగిపోయి, విశ్వసనీయంగా సహకరించే ఉపకరణం కావడం, ఉత్థాన పతనాల యెడల, జయాపజయాల యెడల సమభావం కలిగివుంటూ ఆతని కార్యాన్ని చిన్నచూపు చూడకుండా నెరవేర్చడం - దాన్ని సాధించాను. హిందూమతం అంటే యేమిటో అప్పుడే నేను గ్రహించాను. మనం తరచుగా హిందూమతాన్ని గురించి సనాతనధర్మాన్ని గురించి మాట్లాడుతుంటాం. కాని మనలో కొద్దిమందికే ఆ మతం అంటే యేమిటో తెలుసు. ఇతర మతాలు ప్రధానంగా విశ్వాసం, ప్రకటనలకు సంబంధించిన మతాలు. కాని సనాతన ధర్మమంటే జీవితమే.

దాన్ని నమ్మడం కంటే, అధికంగా, జీవించవలసిన ధర్మం. అనాదికాలం నుండి ఈ ద్వీపకల్పం మీద ఏకాంతంలో మానవ జాతి విమోచన కోసం పదిలంగా పరిరక్షించుకొనబడిన ధర్మం. ఈ మతాన్నందించడం కోసమే భారతదేశ పునరుత్థానం జరుగుతోంది. ఇతర దేశాలలాగా తన కోసం, లేదా బలవత్తరమైనపుడు బలహీనమైనవాటిని అణచివేయడానికి కాదు అది తిరిగి ఉన్నత స్థితి నందుకోవడం. తన కప్ప గించబడిన శాశ్వత వెలుగును ప్రపంచం పై ప్రసరింపజేయడానికి ఆమె పునరుత్థానమవుతోంది. భారతదేశం యెప్పుడూ తనకోసం గాక, మాన వాళి కోసమే మనుగడ సాగించింది. ఇపుడామె తిరిగి గొప్పగా యెదగడం మానవాళి కోసమేగాని ఆమె కోసం కానే కాదు.

అందుచేతనే భగవంతుడు నాకు యెత్తిచూపిన తదుపరి విషయం - హిందూమతం యొక్క ప్రధాన సత్యం. దానిని సాక్షాత్కరింప జేసుకొనేటట్లు నన్ను అతడు తయారు చేసాడు. జైలు అధికారుల హృదయాల్లో నా పై సౌమ్యభావాన్ని నింపాడు. వాళ్లు తమ ఆంగ్లేయ అధికారితో నా గురించి

"ఏకాంతంగా చిన్న గదికి పరిమితం చేయడంవల్ల అతను బాధ పడుతున్నాడు. ఉదయసాయంకాలాల్లో కనీసం ఒక అరగంట జైలు ఆవర ణలో పచార్లు చేయడాని కనుమతిద్దాం" అని చెప్పారు. ఆ యేర్పాటు జరిగింది. అలా నడుస్తున్న సమయంలో భగవంతుని బలం తిరిగి నాలో ప్రవేశించింది. నన్ను మనుషుల నుండి వేరుచేసిన జైలుగది వైపు చూశాను. నన్ను బంధించేది ఎంతమాత్రం దాని ఎత్తైన గోడలు కాదు, వాసుదేవుడే నా చుట్టూ ఉన్నాడు. నా జైలుగది బయట వున్న చెట్టుక్రింద నడిచాను. కాని అది చెట్టు కాదు, వాసుదేవుడే, శ్రీకృష్ణుడే అచట నిలబడి నాకు తన నీడనిస్తున్నాడు. నా జైలు గది కటకటాల వంక చూసాను. తలుపుగా వున్న ఆ కటకటాల ఇనుపచట్రం వాసుదేవునిగా నాకు దర్శనమిచ్చింది. నారాయణుడే నాకు కాపలా వుండి రక్షిస్తున్నాడు. లేదా నా కిచ్చిన ముతక దుప్పటి పై పడుకున్నప్పుడు, శ్రీకృష్ణుని, నా సఖుని, నా ప్రియుని బాహుబంధాలలో ఉన్న అనుభూతి చెందాను. అతడు నాకు ప్రసాదించిన లోతైన అంతర్దృష్టి వల్ల కలిగిన ప్రయోజనమిది. దొంగలు, హంతకులు, మోసగాళ్లు అయిన, కారాగారంలోని ఇతర ఖైదీలను చూసాను. వాళ్లనలా చూస్తున్నపుడు వాసుదేవుడే కన్పించాడు. మసకబార్చబడిన అంతరాత్మలు, దుర్వినియోగం చేయబడిన దేహాలుగల వీళ్లలో నారాయణుడే కన్పించాడు. ఈ దొంగలు, దోపిడీ దొంగల మధ్యలో చాలామంది తమలోని సానుభూతి, నేను తలదించుకొనేలా చేసారు. అటువంటి విరుద్ధ పరిస్థితులను దయాగుణాల్తో జయించి మానవత నిలబడింది. వాళ్లలో ప్రత్యేకించి ఒకరు వ్రాయడం, చదవడం తెలియని వ్యక్తి, నా జాతికి చెందిన కర్షకుడు. దోపిడి దొంగగా చిత్రించబడి, పది సంవత్సరాల కఠిన కారాగారశిక్ష విధించబడిన వ్యక్తి. ఉన్నతవర్గాలవార మనే గర్వంతో మనము, తక్కువజాతి వాళ్లని ఈసడించే జాతికి చెందిన ఆ మనిషి, నాకు ఒక మహాత్ముడుగా కన్పించాడు. మరొక్కసారి భగవం తుడు నాతో ఇలా అన్నాడు. "నాకు సంబంధించిన ఒక మహాకార్యంలో నీ వంతుగా కొంచెం చేయడానికి ఏ జనం మధ్యకు నిన్ను పంపించానో చూడు. ఇటువంటి జాతిని నేను ఉద్ధరిస్తున్నాను, ఉద్ధరించడానికి గల కారణం కూడా ఇదే."

క్రింది కోర్టులో మా కేసు విచారణ ప్రారంభ సందర్భంలో మేజి స్ట్రేటు దగ్గరకు మమ్మల్ని తీసుకొచ్చినపుడు ఇదే అంతర్దృష్టి నాలో నన్ను అనుసరించి ఉంది. భగవంతుడు "నిన్ను జైల్లో పెట్టినపుడు నీ హృదయం భగ్నం కాలేదా, నీ రక్షణ ఎక్కడ అని నీవు నన్ను ఉద్దేశించి ఆక్రందించలేదా? ఇపుడు మేజి స్ట్రేటు వంక చూడు, ప్రాసిక్యూషనువారి వంక చూడు" అన్నాడు. నేను చూసాను, నాకు కనిపించినది మేజిస్ట్రేటు కాదు, వాసుదేవుడు, నారాయణుడు, న్యాయపీఠం మీద కూర్చుని ఉన్నాడు. ప్రాసిక్యూషను వంక చూసాను. అచట కన్పించింది ప్రభుత్వ న్యాయవాది కాదు, అచట కూర్చుని ఉన్నది శ్రీకృష్ణుడు, నా సఖుడు, నా ప్రియుడు అచట కూర్చుని చిరునవ్వు చిందిస్తూ "ఇంకా భయపడు తున్నావా?" అని ప్రశ్నించి, "నేను మానవులందరిలో ఉన్నాను, వారి మాటలను, చేష్టలను ప్రక్కకు నెట్టి వారిని నియంత్రిస్తాను. నా రక్షణ నీకింకా వుంది, భయపడకు. నీకు వ్యతిరేకంగా మోపబడిన నేరారోపణను నా కొదిలెయ్యి, అది నీ కోసం ఆరోపింపబడలేదు. నిన్నిక్కడకు తీసుకొచ్చింది మరో పనికిగాని నేరవిచారణకు గాదు. ఈ నేరారోపణ గూడా నా కార్యనిర్వహణా విధానంలో భాగం మాత్రమే. అంతకు మించి మరేం కాదు."

క్రింది కోర్టులో విచారణ ప్రారంభమైనపుడు నాకు వ్యతిరేకంగా వున్న సాక్ష్యంలో అసత్యమేమిటో, ఏయే విషయాల మీద ప్రతికూల సాక్షులను విచారించవచ్చో తెలియజేస్తూ నా వకీలుకు అనేక సూచనలు వ్రాయడం మొదలు పెట్టాను. అపుడు నేను ఏమాత్రం ఊహించని ఒక సంఘటన సంభవించింది. నన్ను నిర్దోషిగా నిరూపించడానికి జరిగిన యేర్పాట్లు హఠాత్తుగా మారిపోయాయి. నా తరఫున వాదించడానికి మరొక వకీలు ముందుకొచ్చారు. అతని రంగ ప్రవేశం హఠాత్తుగా జరిగింది. అతను నా స్నేహితుడే, కాని అతను వస్తున్నట్లు నాకు తెలియదు. సమస్త ఆలోచనలు ప్రక్కకు నెట్టివేసి, తన ఆర్జననంతా వదలివేసి, దిన దినమూ అర్ధరాత్రిదాకా నెలల తరబడి శ్రమించి, నన్ను కాపాడడానికి తన ఆరోగ్యాన్ని కూడా పాడుచేసుకొన్న వ్యక్తి శ్రీయుత చిత్తరంజన్ దాస్ పేరు మీరంతా వినే ఉన్నారు. అతనిని చూడగానే సంతృప్తి కలిగింది, అయినా సూచన నివ్వడం అవసరం అని భావించాను. అదంతా

కూడా నాలో నుండి నెట్టివేయబడింది. అంతరంగం నుండి సందేశం విన్పించింది. "ఈ వ్యక్తి నీ కాళ్ల చుట్టూ తగుల్కొన్న ఉచ్చుల నుండి నిన్ను రక్షించగల మనిషి. ఆ కాగితాలన్నింటినీ ప్రక్కని పెట్టు. అతనికి తెలియజేయవలసింది నేనుగాని, నువ్వు కాదు. అతనికి నేను సూచిస్తాను." అప్పటి నుంచి ఆ నా కేసును గురించి నా వకీలుతో నేనుగా ఒక్క మాట కూడా మాట్లాడలేదు లేదా ఒక్క సూచన కూడా చేయలేదు. ఎపుడైనా ఒక ప్రశ్న అడిగితే నా సమాధానం నా కేసుకుపయోగపడేది కాదని తెలిసిపోయేది. నేను అంతా అతనికే వదిలివేశాను. అతను కేసు మొత్తాన్ని తన చేతుల్లోకి తీసుకొన్నాడు. ఫలితం మీ అందరకూ తెలిసిందే. భగవంతుడు నా నుండి యేమి ఆశిస్తున్నాడో అంతా నాకు తెలుసు. ఎందుకనంటే, పదే పదే నేను దాన్ని విన్నాను. ఎప్పుడూ నాలో ఒక వాణిని వింటూనే వున్నాను. "నేను దారి చూపుతున్నాను కనుక భయపడకు. ఏ కార్యం కోసం నిన్ను జైలుకు తీసుకొచ్చానో, నీవు విడుదలైన తర్వాత, ఆ నీ కార్యాన్ని నిర్వహించ పూనుకో. గుర్తుంచుకో, భయపడకు, సంశయించకు. ఇదంతా చేస్తున్నది నేనని, నువ్వుగాని, మరెవ్వరుగాని కాదని గుర్తుంచుకో. కాబట్టి ఏ మబ్బులు క్రమ్మినా, ఎన్ని ప్రమాదాలూ, బాధలూ, యిక్కట్లూ, ఎదురైనా, ఏదీ అసాధ్యం కాదు, ఏదీ కష్టం కాదు. నేను జాతిలో ఉన్నాను, దాని పునరుత్థానంలో వున్నాను, నేను వాసుదేవుడిని, నేను నారాయణుడిని, నేనేమని సంకల్పిస్తే అదే జరుగుతుంది. ఇతరులు సంకల్పించింది కాదు. నేనేది సాధించాలని నిర్ణయిస్తానో, దాన్ని ఏ మానవశక్తి ఆపలేదు."

ఇదిలా వుండగా భగవంతుడు నన్ను ఏకాంతం నుండి బయట పడవేసి నాతోపాటు నిందారోపణ చేయబడ్డ వాళ్ల మధ్య వుంచాడు. నా త్యాగాన్ని గురించి, దేశం యెడల నాకుగల అంకితభావాన్ని గురించి మీరీ రోజు చాలా గొప్పగా మాట్లాడారు. నేను జైలు నుండి విడుదలైనప్పటి నుండీ ఇటువంటి ప్రసంగాలను వింటూనే వున్నాను, కాని మోమోటపడుతూ, ఒకింత బాధతోనే వింటున్నాను. ఎందుకనంటే నా బలహీనత నాకు తెలుసు. స్వీయ తప్పిదాలకు, వెనుకంజలకు గురికాబడిన వాడను. ఇంతకు పూర్వం అవి నాకు

తెలియకపోలేదు. ఏకాంతంలో అవన్నీ ఒక్కసారిగా నా పై తిరగబడినపుడు వాటి ప్రాబల్యత నాకు పూర్తిగా అవగతమైంది. ఇటువంటి మనిషినైన నేను బలహీనతల పుట్టననీ, అపసవ్య మరియు అపరిపూర్ణ ఉపకరణాన్ననీ ఒక ఉన్నతశక్తి నాలో ప్రవేశించినపుడే నేను శక్తివంతుణ్ణి కాగలుగుతున్నాననీ నాకు తెలుసు. అటువంటి స్థితిలో నేను ఈ యువకుల మధ్యకొచ్చాను. వాళ్లలో చాలామంది ఎంతో ధైర్యం, నిరహంకారప్రవృత్తి కల్గినవారని గ్రహించాను. ఈ విషయంలో వాళ్లతో పోల్చుకుంటే, నేను ఎందుకూ కొరగాను, శక్తిలోనూ, నడతలోనూ మాత్రమే గాకుండా ఒకరిద్దరు - ఒకరిద్దరే కాదు అలాంటివారు చాలామందే వున్నారు. నేను గర్వపడే మేథో సామర్థ్యంలో గూడా నాకంటే ఉన్నతమైనవారిని చూసాను. "నా ఆదేశానుసారం పైకి లేస్తున్న యువత యిది, నూతన మరియు బలీయమైన జాతి యిది. వాళ్లు నీకంటె గొప్పవాళ్లు. దేనికి భయపడాలి? నీవు ప్రక్కకు తప్పుకొన్నా, నిదురించినా, నా కార్యం జరిగి తీరుతుంది. నీవు రేపు ఒక ప్రక్కకు నెట్టివేయబడితే, నా కార్యాన్ని స్వీకరించి, నీవు ఇదివరకెన్నడూ చేయలేనంత శక్తివంతంగా చేయడానికి యువకులున్నారు. ఈ జాతిని ఉద్ధరించే ఒక మాట విన్పించడానికి నా నుండి నీవు కొద్ది శక్తిని పొందావు." ఇది, నాకు అతను చెప్పిన తదుపరి విషయం.

ఆ తరువాత హఠాత్తుగా ఏదో జరిగింది. వెంటనే నన్ను తిరిగి ఒక్కరే ఉండే జైలుగదిలో ఏకాంతంలోనికి పంపించారు. ఆ కాలంలో నా అనుభవాలను చెప్పాలనిపించడం లేదు. కాని రోజు రోజుకు, భగవంతుడు నాకు తన అద్భుతాలు చూపించాడు, హిందూమతం యొక్క అసలు సత్యాన్ని నేను గ్రహించేట్లు చేసాడు. నాకిదివరకు చాలా సంశయాలుండేవి. విదేశ భావాల ప్రభావాల మధ్య పూర్తిగా విదేశీయ వాతావరణంలో నేను ఇంగ్లాండులో పెరిగి పెద్దవాడినయ్యాను. హిందూ మతం లోని చాలా విషయాలు ఊహలని, స్వాప్నిక విషయాలు, భ్రమలనీ అనుకొనేవాడిని.

కాని ఇపుడు ప్రతిరోజూ, మనస్సులో, హృదయంలో, దేహంలో కూడా హిందూమతంలోని సత్యాలను సాక్షాత్కరింప జేసుకొన్నాను. నాకవి సజీవ అనుభవాలు. పదార్థ విజ్ఞాన శాస్త్రం వివరించలేని విషయాలు నాకు

తేటతెల్లమైనాయి. పూర్తిగా భక్తిభావంతోగాని, పూర్తిగా జిజ్ఞాసతోగాని నేను ప్రారంభంలో భగవంతుని వైపు చూడలేదు. స్వదేశీ ఉద్యమం ప్రారంభానికి కొన్ని సంవత్సరాలకు ముందు నేను బరోడాలో ఉన్నపుడు భగవంతుని వైపు నడిచాను. తరువాత ప్రజల్లోకి ఆకర్షించబడ్డాను.

భగవంతుని వైపు తిరిగిన అప్పట్లో, ఆతని పట్ల నాలో సజీవమైన విశ్వాసం అంతగా లేదు. నాలో అజేయవాది ఉన్నాడు, నాస్తికుడున్నాడు, సంశయాత్ముడున్నాడు. అసలు భగవంతుడున్నాడనే విషయం కూడా నాకు ఖచ్చితంగా తెలియదు. ఆతని తాలూకు సంవేదన నాకెన్నడూ కలుగలేదు. అయినా ఏదో నన్ను వేదాలవైపు, గీతాసత్యం వైపు, హిందూ మతసత్యం వైపు ఆకర్షించింది. ఈ యోగంలో ఎక్కడో ఒక బలీయమైన సత్యమే వుంది అని అన్పించింది. యోగంవైపు తిరిగి, దానిని అనుష్ఠించాలని, నా భావన యదార్థమో కాదో తెలుసుకోవాలని నిర్ణయించుకొన్నపుడు, ఈ భావంతో, ఈ ప్రార్థనతో ఆయనవైపు తిరిగాను. "నీవు కనుక ఉన్నట్లైతే, నీ కపుడు నా హృదయం తెలిసే వుంటుంది. ముక్తి కావాలని అడగనని, ఇతరులు అర్థించేదాన్ని దేన్నీ నేనర్థించననీ నీకు తెలుసు. ఈ జాతినుద్ధరించు బలం కావాలని మాత్రమే అర్థిస్తున్నానని నీకు తెలుసు". యోగసాక్షాత్కారం పొందాలని చాలా కాలం పెనుగులాడాను, చివరికది కొంతవరకు సాకారమైంది. కాని నేను అత్యధికంగా ఏం కావాలని అభిలషించానో ఆ విషయంలో సంతృప్తి లభించలేదు. అటువంటి సమయంలో జైలుగది ఏకాంతంలో దాని కోసం మళ్లీ అడిగాను. "నీ ఆదేశం ఏమిటో చెప్పు, ఏం చేయాలో, ఎలా చేయాలో నాకు తెలియడం లేదు. సందేశం పంపించు." యోగంలో వుండగా రెండు సందేశాలు అందాయి. "ఈ జాతి నుద్ధరించడం అనే కార్యం నీ కప్పగించాను. త్వరలోనే నీవు జైలు నుండి విడుదలయ్యే సమయం వస్తుంది. ఎందుకనంటే ఇపుడు నీకు శిక్షపడడంగాని, లేదా ఇతరులు చేయవలసి వున్నట్లుగా దేశం కోసం బాధపడ్తూ నీవు కాలం వెళ్లబుచ్చడంగాని నా సంకల్పం కాదు. నా కార్యనిర్వహణకు నిన్ను పిలిచాను, నీ వడిగినందుకు నేనిచ్చే సందేశం ఇదే." రెండో సందేశం ఇలా అందింది. "ఈ సంవత్సరకాల ఏకాంత వాసంలో నీకు కొంత అనుభవాన్నిచ్చాను. నీకు దేన్ని

గురించి సంశయా లున్నాయో, దాన్ని గురించి కొంత తెలియచేసాను, అదే హిందూ మతం లోని సత్యం. దీన్నే, ఈ మతాన్నే నేను ఉద్ధరించి ప్రపంచం ముందు పెడ్తున్నాను. ఈ మతధర్మాన్నే ఋషులు, యోగులు, భగవదవతారాల ద్వారా పరిపూర్ణం చేసి, అభివృద్ధి చేసారు. అదిప్పుడు జాతుల మధ్య నా పని చేయడానికి ముందు కెళ్తోంది. ఇదే సనాతన ధర్మం. నీకిదివరకు నిజంగా తెలియని దేనిని నీకిపుడు తెలిసేట్లు చేసానో ఆ శాశ్వతమతం ఇది. నీలోని అజేయవాదికి, సంశయాత్మునికి సమాధానం ఇచ్చాను. ఎందుకనంటే నీకు వెలుపల, నీ అంతరంగంలోనూ, భౌతికమైనవి, అంతర్గతమైనవి, నీకు సంతృప్తి కలిగించిన ఋజువులు చూసాను. సనాతనధర్మం కోసం, వాళ్లు గొప్పవాళ్లు కావాలి, ప్రపంచం కోసమేగాని వాళ్లకోసం కాదు వాళ్లు గొప్పవాళ్లయేది అనే పలుకునే నీవు బయటకు వెళ్లిన పిదప వాళ్ల కెపుడూ విన్పించు. ప్రపంచ సేవ చేయడానికే నేను వాళ్లను స్వతంత్రులను చేస్తున్నాను, వాళ్లకు స్వేచ్ఛే నిస్తున్నాను. కనుక భారతదేశం పునరుత్థానం కావాలని చెప్పినప్పుడు, ఉత్థానమయ్యేది సనాతనధర్మం. భారతదేశం గొప్పది కావాలన్నపుడు, గొప్పదయ్యేది సనాతనధర్మం. భారతదేశం తనను తాను విశాలం చేసుకోవాలి, విస్తరించాలి అని చెప్పినప్పుడు ప్రపంచంపై విశాలంగా విస్తరించేది సనాతన ధర్మం. ధర్మం కోసం, ధర్మం వల్ల భారతదేశం నిలుస్తుంది. మతాన్ని గొప్పగా చూపడమంటే, దేశాన్ని గొప్పగా చూపడం, సర్వే సర్వత్రా, మానవు లందరిలోనూ, వస్తువులన్నిటియందూ నేనున్నానని చూపించాను. ఈ ఉద్యమంలోనూ, దేశం కోసం శ్రమించేవాళ్లలోనూ మాత్రమే కాదు, వారిని వ్యతిరేకించే వాళ్లలో, వారి దారికడ్డుగా నిలిచేవాళ్లలో గూడా నేనే పనిచేస్తున్నాను. నేను ప్రతిదేహంలోనూ పని చేస్తున్నాను. మనుష్యులు ఏమి ఆలోచిస్తున్నా, ఏ కర్మ చేస్తున్నా నాకార్యానికి సాయపడడం కంటే ఏదీ చేయలేరు. వాళ్లు కూడా నా కార్యమే నిర్వహిస్తున్నారు, వాళ్లు నాకు శత్రువులు కాదు. నా ఉపకరణాలు. ఎటుపోతున్నావో తెలియకపోయినా నీ చర్య లన్నింటి ద్వారా ముందుకే పోతున్నావు. నీ వొకటి చేయాలను కొంటావు, మరొకటి చేస్తావు. ఒక ఫలితాన్ని అభిలషించి పనిచేస్తావు. దానికి భిన్నమైన లేదా వ్యతిరేకమైన ఫలితాలకే నీ చర్యలు దారితీస్తాయి.

ప్రజల్లోకి పోయి పనిచేస్తున్నది దైవశక్తే. చాలా కాలం నుండి ఈ పునరుత్థానానికి జాతికి సన్నద్ధం చేస్తున్నాను. ఇపుడా సమయం ఆసన్నమైంది. అది నెరవేరేట్లు దాన్ని నడిపేది నేను."

ఇదే నేనిపుడు మీకు చెప్పవలసి వున్నది. మీ సభ పేరు "మతసంర క్షణ సభ". బాగుంది. మత సంరక్షణ అంటే మతాన్ని రక్షించడం, పునరుత్థానమైన హిందూమతాన్ని ప్రపంచం ముందు నిలబెట్టడం. అదీ, మన ముందున్న కార్యం. కాని హిందూ మతమంటే ఏమిటి? హిందూజాతి దానిని నిలబెట్టుకొని వుంచుకొన్నది గనుక అది హిందూమతమైంది. ఈ ద్వీపకల్పంలో, సముద్రాల, హిమాలయాల ఏకాంతంలో అది పెంచి పోషించబడింది గనుక అది హిందూమతమైంది. ఈ పవిత్ర పురాతన గడ్డపై దానిని కాపాడవలసిన బాధ్యత యుగాల నుండి ఆర్యజాతి కప్పగించబడింది గనుక అది హిందూమతమైంది. కాని, అది ఒక దేశం ఎల్లల మధ్య గిరిగీసి బంధించబడి లేదు. ప్రపంచంలో కొన్ని హద్దులకు పరిమితమైన ఒక భాగానికి ప్రత్యేకమైనది కాదు. హిందూమతం అని మనం చెప్పుకొనేది నిజానికి శాశ్వతమైన మతం. ఎందుకనంటే అది ఇతర మతాలన్నింటినీ ఆలింగనం చేసుకొన్న విశ్వజనీన మతం. ఒక మతం విశ్వజనీనం కాకపోయినట్లైతే అది శాశ్వతం కాలేదు. ఒక సంకుచిత మతం, ఒక తెగకు పరిమితమైన మతం, కొద్దికాలం మాత్రమే, పరిమిత కార్యం కోసమే మనగలుగుతుంది. విజ్ఞాన శాస్త్ర ఆవిష్కారాలను, వేదాంత విషయవిచారణలను ముందుగానే గ్రహించి వాటిని తనలోనికి స్వీకరించడం ద్వారా, వాటి నధిగమించి చూడగల మతం ఇదొక్కటే. భగవంతునికీ మనకుగల సన్నిహితత్వంతో మానవాళిని ప్రభావితం చేసి మనిషి భగవంతుని సమీపించడానికి గల సాధ్యమైన సమస్త ఉపాయాలను తన విశాల పరిధిలోనికి ఇముడ్చుకోగల మతం ఇదొక్కటే. భగవంతుడు మానవులందరిలోనూ వస్తువులన్నింటి యందూ ఉన్నాడు, అతనిలోనే మనం చరిస్తున్నాం. అతనిలోనే మన అస్తిత్వం ఉంది అని సర్వమతాలు అంగీకరించిన సత్యాన్ని ప్రతి క్షణం ఒత్తిచెప్పే మతం ఇదొక్కటే. ఈ సత్యాన్ని గ్రహించి, నమ్మగలిగేట్లు మనల్ని తయారు చేయగల, మన అస్తిత్వపు ప్రతి అంశం ఆ సత్యాన్ని నిజం చేసుకొనేట్లు చేయగల

మతం ఇదొక్కటే. ప్రపంచమంటే నాకు దేవునిలీల అని ప్రపంచానికి చూపగల మతం ఇదొక్కటే. ఆ లీలలో మనకు సంబంధించిన భాగంలో సూక్ష్మాతి సూక్ష్మ నిబంధనలను, ఉదాత్తమైన నియమాలను ఎంత బాగా ఆచరించగలమో చూపగల మతం ఇదొక్కటే. ఏ విధమైన అత్యల్ప విషయంలో గూడా మతం నుండి జీవితాన్ని వేరుచేయని మతం ఇదొక్కటే. అమ్మ తత్వమంటే ఏమిటో తెలిపిన, మృత్యువు నిజం అన్న భావనను, మన నుండి పూర్తిగా తొలగించివేసిన మతం ఇదొక్కటే.

ఈ రోజు మీకు విన్పించడానికి, నా నోట పలికిన మాట ఇదే. నేను మాట్లాడుదామనుకొన్నది నాకు దూరమైంది. నా కిచ్చిన దానిని మించి నేను పలుకవలసిందేమీ లేదు. నాలో ప్రవేశ పెట్టబడిందీ పలుకే, దాన్నే నేను మీకు చెప్పగలిగాను. మీకు చెప్పవలసివున్న ఆ పలుకును విన్పించడం పూర్తైంది. నాలోని ఈ శక్తితో ఇంతకు ముందొకసారి మీతో మట్లాడాను. ఇది రాజకీయ ఉద్యమం కాదని, జాతీయత అనేది రాజకీయాలు కాదని, అదొక మతమని, ఒక సిద్ధాంత సారమనీ, విశ్వాసమనీ అప్పుడు చెప్పాను. అదే విషయాన్ని మళ్లీ ఇప్పుడు చెప్తున్నాను. కాని మరో విధంగా చెప్తున్నాను. జాతీయత అంటే కొన్ని సూక్తులపై ఒక నమ్మకం కాదు, ఒక మతం కాదు, ఒక విశ్వాసం ఇంకెంత మాత్రం కాదు. సనాతన ధర్మమే మన జాతీయత. ఈ హిందూజాతి సనాతన ధర్మంతో పుట్టింది. సనాతనధర్మంతో జీవిస్తుంది, సనాతనధర్మంతో అభి వృద్ధి చెందుతుంది. సనాతనధర్మం క్షీణించినపుడు దానితోపాటే క్షీణిస్తుంది. సనాతన ధర్మం నశించగలిగినదైతే, సనాతనధర్మంతోనే హిందూజాతి నశిస్తుంది. జాతీయత అంటే సనాతన ధర్మమే. మీకీ రోజు విన్పించవలసివున్న సందేశమిదే.

**"ఈ వివాదము నిశ్శబ్దమై, సమసిపోయిన చాలా కాలం తర్వాత, ఈ సంక్షోభం, ఈ అలజడి శాంతించిన చాలా కాలం తర్వాత, ఆయన తనువు చాలించి వెళ్ళిపోయిన చాలా కాలం తర్వాత దేశభక్తి ప్రేరణ కలిగించిన కవిగా, జాతీయతా ప్రవక్తగా, మానవతా ప్రేమికునిగా, ఆయనను ప్రపంచం గౌరవభావంతో చూస్తుంది. ఆయన తనువు చాలించి వెళ్ళిపోయిన చాలా కాలం తర్వాత కూడా ఆయన పలుకులు భారతదేశంలో మాత్రమేగాక మహా**

సముద్రతీరాల మీదుగా, దూరదేశాలలో గూడా ధ్వనిస్తూ, ప్రతిధ్వనిస్తాయి. (అలీపూరు కుట్ర కేసు విచారణలో దేశబంధు శ్రీ చిత్తరంజన్ దాస్ చేసిన ముగింపు ప్రసంగంలోని నుండి.)"

అనువాదం :

**కె. వి. రావు శ్రీ అరవింద సొసైటీ, పుదుచ్చేరి 605 002 వారి సౌజన్యంతో...**

# మూడు ఉన్మాదాలు

# (అభిరుచులు)

**(శ్రీ అరవిందులు, వారి భార్య మృణాళిని దేవికి 30 ఆగస్టు, 1905న వ్రాసిన బెంగాలీ లేఖ యొక్క కొంత భాగం తెలుగులోకి అనువదించబడి క్రింద పునరుత్పత్తి చేయబడింది.)**

నాకు మూడు ఉన్మాదాలు ఉన్నాయి. మొదటిది ఇది. దేవుడు నాకు ఇచ్చిన విజయాలు, మేధస్సు, ఉన్నత విద్య, పాండిత్యం మరియు సంపద మొదలైన దైవ ప్రసాదాలు అన్నీ ఆ పరాత్పరుడికి చెందినవే అని నేను గట్టిగా నమ్ముతున్నాను. ఇవన్నీ కేవలము నేను నా కుటుంబ నిర్వహణకు, పోషణకు మరియు అత్యవసరాల కోసం మాత్రమే ఖర్చు చేసే హక్కు నాకు ఉంది. మిగిలినది అంతా నేను దైవానికి తిరిగి సమర్పించాలి. అంతకు మించి నేను నా ఆనందం మరియు సౌకర్యం కోసం వినియోగించినట్లయితే, నేను ఒక దొంగనే. హిందూ ధర్మశాస్త్రాల ప్రకారం ఎవరైతే భగవంతుని నుండి పొందిన ధనమును తిరిగి ఆయనకే సమర్పించనట్లయితే ఆ వ్యక్తి దొంగ అని పేర్కొనబడతాడు. ఇప్పటి వరకు, నేను దేవుడికి రెండు అణాలు మాత్రమే ఇచ్చాను మరియు మిగిలిన పధ్నాలుగు అణాలు నా ఆనందం కోసం ఉపయోగించాను; ఈ విధంగా నేను లౌకిక ఆనందాలలో మునిగిపోయి, పద్దును నిర్ణయం చేసాను. నా సగం జీవితం వృథా అయింది - జంతువులు కూడా తన ఆకలి మరియు తన కుటుంబ ఆకలిని తీర్చడంలో తృప్తిని పొందుతాయి. ఇన్ని రోజులు నేను జంతువుగా మరియు దొంగగా వ్యవహరిస్తున్నానని గ్రహించాను. ఇప్పుడు నాలో పశ్చాత్తాపం నిండి నాపై నాకే అసహ్యం వస్తున్నది. ఇక ఇలా జరగకూడదు. నేను ఈ పాపాన్ని శాశ్వతంగా వదులుకుంటాను. దైవానికి ఇవ్వడం అంటే ఏమిటి? దైవ కార్యంలో ఖర్చు చేయడం అని అర్థం. నేను

ఉషకు లేదా సరోజినికి ఇచ్చిన ధనం విషయంలో నాకు ఎలాంటి విచారం లేదు. ఇతరులకు సహాయం చేయడం అనేది ఒక పవిత్రమైన కర్తవ్యం; ఆశ్రయం పొందిన వారికి రక్షణ కల్పించడం ఇంకా గొప్ప పవిత్ర కర్తవ్యం. కానీ స్వంత సోదరులు మరియు సోదరీమణులకు మాత్రమే ఇవ్వడం ద్వారా ఖాతా పరిష్కరించబడదు.

ఈ చీకటి రోజుల్లో దేశమంతా నా వాకిట ఆశ్రయం అర్థిస్తున్నది. ఈ దేశంలో నాకు 30 కోట్ల సోదరులు మరియు సోదరీ మణులు ఉన్నారు. వారిలో చాలా మంది ఆకలితో చనిపోతున్నారు మరియు ఎక్కువ మంది కేవలం దు:ఖం మరియు బాధతో బ్రతుకుతున్నారు. వారికి కూడా సహాయం అందాలి.

నీవు ఏమంటావు? ఈ విషయంలో నా ఆదర్శాన్ని పంచుకుంటావా? మనం సాధారణ వ్యక్తుల వలె తినడము మరియు దుస్తులు ధరించడము చేద్దాము. నిజంగా అవసరమైన వాటిని మాత్రమే కొనుగోలు చేసి, మిగిలిన ధనమును దేవుడికి సమర్పించుదాము. నేను చేయాలనుకుంటున్నది ఇదే. నీవు నీ సమ్మతిని తెలియజేస్తూ, ఈ త్యాగాన్ని అంగీకరిస్తేనే నా ఉద్దేశ్యము పరిపూర్ణం అవుతుంది. నీవు అంటూ వుంటావు కదా "నేను పురోగతి సాధించలేదు" అని. ఇక్కడ నేను నీకు పురోగతికి మార్గం చూపిస్తున్నాను. నీవు ఈ మార్గాన్ని అనుసరిస్తావా?

నా రెండవ ఉన్మాదము ఇటీవలే నన్ను ఆవహించింది. అది ఇదే: ఏ విధంగానైనా నేను దేవున్ని ప్రత్యక్షముగా దర్శించాలి. ఈ రోజుల్లో మతం అంటే ఏదైనా క్లిష్ట సమయంలో దేవుని పేరును పదేపదే ఉచ్చరించడం, బహిరంగంగా జన సమూహములో ప్రార్థన చేయడము, తాను ఎంత పవిత్రుడనో అని ప్రదర్శించడం, ఈ రకమైనవేవి నేను కోరుకోవడము లేదు. ఒకవేళ భగవంతుడు అనే వాడు - వుంటే, అతనిని ముఖాముఖి కలవడానికి, అతని ఉనికిని అనుభవించడానికి, ఏదో మార్గం ఉండే ఉంటుంది. ఈ మార్గం ఎంత శ్రమతో కూడుకున్నదైనా, నేను దానిని అనుసరించడానికి నిర్ణయించుకున్నాను.

హిందూమతం, మార్గం అనేది ఒకరి స్వశరీరంలో, మనస్సులోనే ఉంటుందని ప్రకటించింది. అది ఆ మార్గంను అనుసరించడానికి నియమాలను నిర్దేశించింది. కావున నేను వాటిని గమనించడం ప్రారంభించాను. ఒక నెలలోనే

నేను హిందూ మతం చెప్పేది తప్పుకాదని గ్రహించాను. అది చెపుతున్న సంకేతాలను నేను నాలో అనుభవిస్తున్నాను. ఇప్పుడు నేను నిన్ను కూడా ఈ మార్గంలో తీసుకెళ్లాలనుకుంటున్నాను. నీవు నాతో సమానంగా నడవలేవేమో, ఎందుకంటే నీకు అవసరమైన జ్ఞానం లేదు. కానీ నన్ను అనుసరిస్తూ నా వెనకాల నడవడానికి నిన్ను ఏది ఆపలేదు. ఈ మార్గంలో అందరూ పరిపూర్ణతను సాధించవచ్చు, కానీ ఈ మార్గములో ప్రవేశించడం అనేది వారి వారి ఇచ్ఛపై ఆధారపడి ఉంటుంది. ఎవరూ నిన్ను ఆ మార్గము లోనికి లాగలేరు. నీవు దీనికి అంగీకరిస్తేనే, నేను దాని గురించి మరింత వ్రాస్తాను.

ఇక నా మూడవ పిచ్చి ఏమిటంటే, ఇతరులు తమ దేశాన్ని ఒక నిర్జీవ జడ పదార్థ భాగముగా చూస్తారు - కొన్ని పచ్చికబయళ్ళు, పొలాలు, అడవులు, కొండలు మరియు నదులుగా - నేను మాత్రం నా దేశాన్ని ఒక మాతృమూర్తిగా దర్శిస్తున్నాను. నేను ఆమెను జననిగా ఆరాధిస్తాను, పూజిస్తాను. ఒక రాక్షసుడు తన తల్లి ఛాతీపై కూర్చుని ఆమె రక్తం పీల్చడం ప్రారంభిస్తే ఆమె తనయుడు ఏమి చేస్తాడు? అతను ప్రశాంతంగా కూర్చుని భుజించగలడా? తన భార్య మరియు పిల్లలతో సుఖసంతోషాలతో ఉంటాడా లేదా తన తల్లి విముక్తికై పరుగెత్తుతాడా? ఈ పతనమయిన జాతిని విముక్తపరచే శక్తి నాకు ఉందని నాకు తెలుసు. ఇది శారీరక బలం కాదు, - నేను ఖడ్గము లేదా తుపాకీని ఉపయోగించి పోరాడను. కానీ నా జ్ఞాన శక్తిని వినియోగించి యుద్ధం చేస్తాను. క్షత్రియ శక్తి ఒక్కటే కాదు; జ్ఞానంపై ఆధారపడిన బ్రాహ్మణ శక్తి, కూడా ఉంది. ఈ భావన నాలో కొత్తది కాదు. ఈనాటిది కాదు. నేను దానితో జన్మించాను, అది నా మూలుగలోనే ఉంది. ఈ గొప్ప కార్యమును సాధించడానికి దేవుడు నన్ను ఈ భూమి పైకి పంపాడు. ఈ విత్తనం నా పద్నాలుగేళ్ల వయసులోనే మొలకెత్తడం ప్రారంభమైంది; నాకు పద్దెనిమిదేళ్లు వచ్చేసరికి ఈ సంకల్పము యొక్క వేళ్ళు బలంగా మరియు స్థిరంగా పెరిగిపోయాయి.

**మూలం : బెంగాలీ రచనలు**

# జాతీయ కళాశాల విద్యార్థులకు ఇచ్చిన సందేశము

23 ఆగస్టు, 1907, బెంగాల్ నేషనల్ కళాశాల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, శ్రీ అరవిందులు తన ప్రధానోపాధ్యాయ పదవికి రాజీనామా చేసిన సందర్భంలో, తీవ్ర విచారంతో ఏర్పాటు చేసిన సభలో ఇచ్చిన సందేశము.

నా ఉద్యోగ విరమణ సమయంలో మీకు కొన్ని సూచనలు ఇవ్వమని అర్థించినట్లు తెలిసింది. కానీ, నా అభిప్రాయంలో, మీ కొత్త తరానికి చక్కని అభిప్రాయాలు, ఉద్దేశాలు, మా పెద్దతరం కన్నా ఎక్కువగానే ఉన్నాయి. నా పట్ల మీకున్న గౌరవాభిమానాలను చూసి నా గుండెలలో పుట్టుకొచ్చిన భావాలను వ్యక్తపరచడం అసాధ్యం.

మీ అందరికి తెలుసు నేను ఉద్యోగ విరమణ చేశానని. నిన్న మీరు జరిపిన సమావేశంలో నా ప్రస్తుత ఇబ్బందులకు గాను సానుభూతి వ్యక్తం చేశారని నేను చూశాను. నేను వాటిని అసలు ఇబ్బందులని పిలవాలా వద్దా అని నాకు తెలియదు, ఎందుకంటే నాకు ఈ ఉద్యోగం గురించి చింత లేదు. చిన్నతనం నుండీ నాకు ఉన్న స్వాతంత్ర్యాభిమానం, వయసుతో బాటు ఇనుమడించింది (పెరిగింది). నాకు, మీ నుండి కావలసినది సానుభూతి కాదు, నా ఉద్యమం పట్ల అవగాహన, అది మీరు కూడా కొనసాగించాలన్న పట్టుదల, నాకు చాలు. మీలో కనపడుతున్న అభిమానం. నాలో ఉన్న మాతృ దేశాభిమానం కొనసాగి, నేను తలపెట్టిన ఉద్యమం మీరు కొనసాగించగలరని కూడా నాకు నమ్మకం కలుగుతున్నది.

నేను ఈ సందర్భంలో మీకు ఇవ్వగలిగిన, సలహా, సూచనలు ఏమంటే, మనం ఈ కళాశాల ప్రారంభించడానికి గల ముఖ్య ఉద్దేశం, భావి భారత పౌరులని రూపు దిద్దాలని, మన మాతృదేశానికి బంధ విముక్తి కలిగించాలని, మిమ్ములను ప్రపంచ దృష్టిలో మాతృభూమి పుత్రులుగా చూడాలని. మీరు భవిష్యత్తులో ఏ పని చేసిన, అది మన మాతృదేశపు ప్రతిభను ద్విగుణీకృతం చేయాలని మా ఆకాంక్ష, సూచన, మార్గదర్శకత్వం కూడా!!

వందే మాతరం!!

ఆగస్టు 23, 1907

# శ్రీ అరబిందో బోధన మరియు సాధన విధానం
# వీరి మార్గం మరియు ఇతర మార్గాలు

మీకు తెలుసా మన అందరిలోనూ ఉన్న ఆత్మ ఓకేపరమాత్మా కు చెందింది అని? మరిమనం దీనిని ఇంతకాలం ఎందుకు తెలుసుకోలేదు? మనలోని అజ్ఞానము అహంకారము అంధకారమై ఈ ముఖ్య అంశాన్ని దాచేసింది. ఎన్నో యుగాల క్రితమే ఋషులు మునులు ఈ విషయాన్ని తెలుసుకున్నారు. కాని మామూలు మనుషులైన మనము శ్రీ అరవిందుల వారి ద్వారా తెలుసుకుంటున్నాము. శ్రీ అరవిందుల వారు చెప్పిన సందేశం అన్ని యోగాలు ముగిసిన చోట సమగ్రయోగం మొదలవుతుంది అని. ఇక్కడ మోక్షం లక్ష్యం కాదు. దివ్యత్వం వైపు అడుగులు నిరంతరం వేస్తూ మన జీవిత గమనాన్ని సాగించడమే మనమార్గం.

ఈ రహస్యం తెలియక పోవడం చేత మానవుడు ఎన్నో కష్టాలతో పోరాటం చేస్తున్నాడు. అందుచేత ప్రకృతి అంటే భూమి కూడా ఇంకా అస్థిరమైన స్థితిలోనే కొట్టుమిట్టాడుతుంది. ప్రకృతి పరిణామ దిశగా పయనిస్తూ మనలో ఎన్నో మార్పులు తెచ్చినా మనం ఇంకా మన బాహ్య ప్రపంచంలోని అహంకారం తోనే జీవిస్తున్నాము. క్షణిక ఆనందం కోసమే పాకులాడుతున్నాము. అందువల్ల మనలోని దైవ అంశాన్ని గుర్తించలేక పోతున్నాము. దానికి గాను ప్రతీ మనిషి తన జీవితంలో తన మనసును ప్రశాంత పరచి తనని తాను తెలుసుకోడానికి ఎప్పుడు ప్రయత్నిస్తాడో అప్పుడు ఇది సాధ్యమవుతుంది.

కాని ఆధునిక ప్రపంచంలో మనల్ని ఆదుకోడానికి ఎవరూ ముందుకు రారు కదా. అందుకే అనంత చైతన్యపు శక్తి మనదివ్య మాత మరియు శ్రీ అరవిందుల వారిరూపంలో వచ్చి మనకి దారి చూపించే దివ్యపురుషులు అయ్యారు.

వారిరువురు కూడా సమగ్రయోగ విధానము ద్వారా అనంత చైతన్యం వైపు చేసిన ప్రయాణము మనకు మార్గదర్శకం, ఆదర్శం. వారు ఇరువురు ఇదిసాధించి మనకు తోడ్పడటం వల్ల వారు మనకు గురువులయ్యారు.

శ్రీ అరవిందుల వారి సమగ్రయోగ విధానంలో మనం మొదట వారిపై పూర్తి నమ్మకము, విశ్వాసం ఉంచి ధైర్యంగా వుంటూ, నిరంతరం మనల్ని మనం ఆ దివ్యమాత యందు పూర్తిగా ఆత్మ సమర్పణం చేసినపుడు వారి అనుగ్రహం పొందవచ్చు. అలా సమర్పణం చేసినప్పుడు మనలోని అహంకారాన్ని కొంచెం కొంచెంగా ఆ దివ్య మాత మనలో ఒక క్రమబద్ధమైన మార్గం ద్వారా ఆ దివ్య చేతనా స్పృహ ద్వారా మనలో మార్పుకి తోడ్పడుతుంది. అందుకు గాను నిరంతరం మనం ఆ దివ్య శక్తిని మనకు అతి దగ్గరగా తేవడానికి అమ్మ అని పిలుస్తూ ఉంటే ఆ విశ్వమాత మనలోని అన్ని అంశాలలో మార్పు వైపు మలపడానికి సాయపడుతుంది.

అలా మనల్ని మనం పూర్తిగా దైవానికి సమర్పించినపుడు మనలోని మంచి గుణాలను వెలికి తీస్తుంది, అలాగే మనలో ఉన్న చెడు గుణాలను మనం అప్పటిదాకా చేసిన పాపాలను తీసేస్తుంది. అప్పుడు మనలో అనంతమైన ఆనందం కలిగినప్పుడు మన మార్గం దైవం వైపు మారుతుంది. కానీ మనలో ఈ మార్పు మన మనస్సులో ఎక్కడ ఎలా తెలుస్తుంది? అది మొదట మన అంతరంగాన్ని తట్టిలేపి ఎన్నో యుగాలుగా పరిణామక్రమము ద్వారా ఎన్నో జన్మల ద్వారా పొందిన జ్ఞానాన్ని మనలో చైత్య పురుషుడుగా అంటే సైకిక్ బీయింగ్‌గా వున్న ఉనికిని గుర్తించేలా తోడ్పడుతుంది. అదిమన గుండె వెనుక అంతరంగ ఆనందం ద్వారా దాని స్థానాన్ని మనం గుర్తించడానికి మన దివ్య మాత సాయపడుతూ, అలా మొదలయ్యే ఈ ప్రయాణంలో మనలోని దైవ ఉనికిని మనకు తెలిసేలా చేస్తుంది.

ఇది ఒక్క రోజులో సాధ్యం కాదు. ఎందుకు? మనిషి ఎంతో కాలంగా వున్న తన అలవాట్లను మార్చుకుంటూ ఆ దివ్యమాత చెయ్యి గట్టిగా పట్టుకున్నప్పుడు ఇది సాధ్యపడుతుంది. మన దివ్య మాత ఈ ప్రయాణంలో అన్ని తానైవుంటూ

మనల్ని నిరంతరం కాపాడుతుంది. ఈ మార్పు ఎంత త్వరగా మనలో వస్తుంది? మనం ఎంతవరకు అమ్మ మీద నమ్మకం, విశ్వాసం పెట్టిమనల్ని మనం పూర్తిగా సమర్పణ చేస్తామో అంత త్వరగా మన ప్రయాణం గమ్యాన్ని చేరుతుంది. ఈ సమర్పణం ద్వారా మనలో మార్పులు తేవడానికి మనం అమ్మకు అనుమతిని ఇస్తున్నాము.

అంటే మనం ఎంత అనుమతిని ఇస్తే దివ్యత్వం వైపు మన ఈ ప్రయాణం అంత వరకు ఉంటుంది.

మన ఈ ప్రయాణం మూడు దశలుగా విభజించారు:

ఒకటి : స్వీయ సమర్పణ ద్వారా బాహ్య ప్రపంచంలోనే జీవిస్తూ పాటించవలసిన సూత్రాలను పాటిస్తూ అంతర్గత స్వీయ - అభివృద్ధి, ఆత్మ అన్వేషణ ద్వారా అంతరాత్మను కనుగొని అనంతరం మహోన్నతమైన స్మారక స్థితి అంటే, అతీతమైన శక్తితో లీనమై పరిణామం చెందిన ఆ చేతనా శక్తితో పృథ్విపై నడయాడుతూ దివ్యకార్యాన్ని చేయసాగాలి.

ఇది సాధ్యమేనా? ఎలా సాధ్యం? మనలోని ఆకాంక్ష, సమర్పణం ద్వారా ఆత్మ ప్రేరణ కలిగినపుడు దైవ అనుగ్రహం ద్వారా ఆ అతీతమైన దివ్య తేజస్సు తన దివ్య స్పృహ చేతనా శక్తిని మనలో సాధ్యమైనంత వరకు మనం అనుమతించేవరకు తన జ్ఞానాన్ని మనలో వికసించేలా మన దివ్య మాత అనుగ్రహం మనలో పనిచేస్తుంది. ఆ స్థాయిలో ఎన్ని కష్టాలు వచ్చినా ఆ దివ్య మాత మనకు ఎల్లప్పుడూ అండగా ఉండి మనకు తోడ్పడుతుంది. మనం అనుక్షణం దివ్యమాతను తలచుకుంటూ ఉంటే ఇది సాధ్యపడుతుంది. అలా మనలో పూర్తి మార్పు వస్తుంది.

మన ఈ ప్రయాణం ఒక కులానికో ఒక మతానికి సంబంధించింది కాదు. ఎందుకంటే మన అన్వేషణ ఆత్మసాక్షాత్కారం కోసం. ఈ సమగ్రయోగ ప్రక్రియ మన అంతరంగ వికాసానికి మరియు దివ్యత్వంతో అనుసంధానం ద్వారా మనలో ఆత్మసాక్షాత్కారం కలిగి దాని ద్వారా మన భౌతిక శరీరం, మనస్సు ,ప్రాణశక్తి పూర్తిగా అణువణువూ ఆ దివ్య చేతన స్పృహ వైపు ప్రయాణం

చేయడానికి తోడ్పడుతుంది. కాబట్టి, ఈ ప్రక్రియ ద్వారా మనలో పూర్తిగా అన్ని అంశాలలో పరివర్తన స్పష్టంగా కనిపిస్తుంది.

అందుచేత మనం ఏకాగ్రతతో నిరంతరం ఆ దివ్య మాతనే తలుచుకుంటూ పూర్తిగా మనల్ని మనం సమర్పణ చేసినప్పుడే మన దివ్య మాత మరియు శ్రీ అరవిందుల వారు సూచించిన అత్యున్నతమైన దివ్య మానస చైతన్యం వైపు మన ప్రయాణం సాధ్యపడుతుంది.



# మానవాధ్యయన సంస్థ

## INSTITUTE OF HUMAN STUDY

(1965 సర్టిఫికేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ నిబంధన 141 ప్రకారం రిజిస్టర్ చేయబడిన సంస్థ)

1964లో స్థాపించబడి పూర్తిగా శ్రీ అరవిందుల సేవకు అంకితమైన ఈ సంస్థ, శ్రీ అరబిందో అంతర్జాతీయ పాఠశాల ద్వారా, శ్రీ అరబిందో అధ్యయనాల ద్వారా, సామాజిక అవగాహనా కార్యక్రమాల ద్వారా, సెమినార్ల ద్వారా, సమావేశాల ద్వారా, పుస్తక ప్రచురణలు మరియు పత్రికల ద్వారా ఇలా అన్ని స్థాయిల్లో శ్రీ అరబిందుల తత్వవిద్యను అందిస్తుంది.

**లక్ష్యాలు మరియు ఉద్దేశాలు :**

- మానవ వ్యక్తిత్వానికి మూలమైన ఆత్మ యొక్క ఉన్నతికి చెందిన విద్యను అన్ని స్థాయిల్లో నిర్వహించుట.
- మాతారవిందుల రచనలను అధ్యయనం చేయుట. సమగ్ర జీవితంతో దైవానికి అంకితమైన, వ్యక్తిగత మరియు సామాజిక పరిపూర్ణతను కోరుకునే సాధకులకు మాతారవిందుల రచనలను సులభతరం చేయుట.

2-2-4/1, విద్యానగర్, ఓ.యు. రోడ్డు, హైదరాబాద్ - 500 044, తెలంగాణ.